

వైభవంగా ఏకశిల శోభాయాత్ర

బిజినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని చెన్నకేశవ, ఆంజనేయ స్వాముల దేవాలయం నుంచి ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి దేవాలయం వరకు ఏకశిల పదునెట్టాంబడి శోభాయాత్ర ఆదివారం అయ్యప్ప మాలధారణ స్వాములు కనుల పండువగా నిర్వహించారు. ఆలయ 11వ వార్షికోత్సవంలో భాగంగా మహాపడిపూజకు ముందు రోజుస్వామి వారి ఉత్సవమూర్తి, కలశం, ఆభరణాలను ఊరేగింపుగా ఆనందిగిరి కొండపై వెలిసిన అయ్యప్పస్వామి ఆలయం వరకు తీసుకెళ్లి అలంకరించనున్నట్లు గురుస్వాములు పులేందర్‌రెడ్డి, కుమ్మరి శ్రీను, తుమ్మల సురేందర్ తెలిపారు.

పదేళ్లలో కాని పనులు

ఏడాదిలోనే చేశాం

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- జిల్లాలో రూ.136 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

6



పెద్దమందడి మండలం మోజర్ల శివారులో హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే మేఘారెడ్డి

టీకాతో రోగాలు దూరం

- జిల్లాలో పశువులు 1,05,550, గొర్రెలు, మేకలు 8,57,300
- ఏడాదిలో రెండు సార్లు టీకాల పంపిణీ
- జీవాలు ఉన్న చోటనే పశువైద్య శిబిరాలు
- వ్యాక్సినేషన్‌లో వనపర్తి జిల్లా మూడో స్థానం

6



కొత్తకోటలో గొర్రెకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్యాధికారి



పైసలిస్తేనే ఫైల్ కదిలేది

- ప్రభుత్వ కార్యాలయాల్లో పెరుగుతున్న అవినీతి
- కేసులు తారుమారు చేయడం కోసం డబ్బులు అడుగుతున్న పోలీసులు
- పలు శాఖల్లో కాంట్రాక్టర్‌ల నుంచి కమీషన్ రూపంలో మామూళ్లు
- విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు
- ఈ ఏడాది ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏసీబీకి చిక్కిన 15 మంది



లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహబూబ్‌నగర్ మాజీ ఇన్‌చార్జి డీఈవో(ఫైల్)

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో అవినీతి పేరుకుపోయింది. ప్రజలకు ఉచితంగా సేవలు అందించాల్సి ఉండగా, పలువురు అధికారులు పైసలిస్తేనే పనులు చేస్తామనే స్థాయికి తీసుకెళ్లారు. డబ్బులు ఇవ్వని వారిని ఆఫీసర్లు కార్యాలయాల చుట్టూ తిప్పుకోవడం పరిపాటిగా మారింది. వారి తీరుపై విసిగి వేసారిన కొందరు బాధితులు ఏసీబీని ఆశ్రయించి, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టిస్తున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది ఇప్పటి వరకు 15 మంది అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టబడటం అవినీతి తీవ్రతను ఎత్తిచూపుతోంది. నేడు అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం..

- మహబూబ్‌నగర్, ఆంధ్రజ్యోతి

7

రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం పేరుతో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణం పథకంతో సంస్థకు ఆదాయం పెరిగింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏడాది కాలంలో 9.62 మంది మహిళలు బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేశారు. అదే విధంగా అద్దె దుకాణాల విషయంలో పోటీతత్వాన్ని పెంచడం, కార్గో సర్వీస్ పట్ల ప్రత్యేకంగా దృష్టి సారించడంతో ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ డిపోలు లాభాల బాటలో పయనిస్తున్నాయి. అయితే.. బస్సుల్లో ఉచిత ప్రయాణంతో ఆటోల్లో ప్రయాణించే వారు కరువయ్యారు. దాంతో గిరాకీలు లేక ఆటోవాలాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టి నేటికి ఏడాదవుతోంది. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..



నాగర్‌కర్నూల్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఆర్డినరీ బస్సు ఎక్కుతున్న మహిళలు



ఆర్టీసీ బస్సులో ఉచితంగా ప్రయాణిస్తున్నామని ఆధార్ కార్డులు చూపుతున్న మహిళలు

- మహాలక్ష్మి పథకంతో బస్సుల్లో పెరిగిన ఆక్యుపెన్సీ రేషియో
- లాభాల బాటలో ఆర్టీసీ
- ఏడాదిగా ఉమ్మడి జిల్లాలో 9.62 కోట్ల జీరో టికెట్‌లు
- గతేడాదికంటే రూ.88 కోట్ల అధిక ఆదాయం
- ప్రయాణించే వారు లేక ఆటోవాలాల ఇబ్బందులు

కనక మహాలక్ష్మి



నాగర్‌కర్నూల్/మహబూబ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం పథకంతో సంస్థకు లాభాలు వస్తున్నాయి. పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి ఆక్యుపెన్సీ రేటు 72.40 నుంచి 103.21కి పెరిగింది. కూలీ పనులకు వచ్చే మహిళలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. మహాలక్ష్మి పథకం అమలైతే ఆర్టీసీ మరింత నష్టాల్లో కూరుకుపోతుందని వేసిన అంచనాలకు భిన్నమైన పరిస్థితులు ఆయా డిపోల్లో కనిపిస్తున్నాయి. డిపోలన్నీ లాభాల బాటలో నడుస్తున్నట్లు నివేదికలు సూచిస్తున్నాయి. సీజనల్ పాసుల విషయంలో కూడా రాయితీని ప్రకటించిన ఆర్టీసీ నెలలో కేవలం 20 రోజులకు మాత్రమే చార్జీ వసూలు చేస్తుండటంతో ప్రయాణికులు క్రమంగా ఆర్టీసీకి చేరువవుతున్నారు.

గతేడాది కంటే అధిక ఆదాయం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గత నవంబరు 30వ తేదీ వరకు 9.62 కోట్ల

(మిగతా 6లో..)

మహిళలను చూస్తే కసురుకుంటున్నారు



ప్రభుత్వం ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నప్పటికీ బస్సుల్లో మహిళలను చూస్తే కసురుకుంటున్నారు. కొన్ని సార్లు బస్సును ఆపకుండా పోయిన సందర్భాలున్నాయి. అధికారులు చొరవ తీసుకొని మునుపటి మాదిరిగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు గౌరవం ఉండేలా చర్యలు తీసుకోవాలి.

- పాత్లవత్ సుజాత, మిడ్జిల్

బస్సులు పెంచితే మేలు



మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఎంతో మేలు జరుగుతోంది. రోజువారి కూలీలకు కనీస రవాణా ఖర్చులు తగ్గాయి. బస్సులు తక్కువగా ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అవస్థలు పడుతున్నాము. ప్రజల అవసరాలను బట్టి బస్సుల సంఖ్య పెంచితే బాగుంటుంది.

- రాధ, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లా

సాగులో యంత్ర పరికరాలకే

ప్రాధాన్యం

- దుక్కుల నుంచి ధాన్యం విక్రయించే దాకా..
- వడ్ల నుంచి బియ్యం తీసేందుకు ప్యాడీహస్కల్
- సన్నాలను గుర్తించే గ్రెయిన్ కాలిపర్
- తేమ శాతం గుర్తించేందుకు ప్రత్యేక యంత్రం



కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తేమను పరిశీలిస్తున్న సిబ్బంది



వరి ధాన్యంలో తేమను గుర్తించే డిజిటల్ మీటర్

వ్యవసాయంలో యంత్ర పరికరాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. దుక్కి దున్నడం నుంచి పంట కోసి మార్కెట్‌లో విక్రయించే వరకు యంత్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ప్రారంభం నుంచి చివరి వరకు సాంకేతకతను వినియోగిస్తున్నారు. ఏ గ్రేడ్, బీ గ్రేడ్ ధాన్యాన్ని గుర్తించడం, తేమ శాతం తెలిపేందుకు యంత్ర పరికరాలు వినియోగంలోకి తెచ్చారు. వడ్ల నుంచి బియ్యపు గింజలు తీసేందుకు ప్యాడిహస్కల్‌ను వినియోగిస్తున్నారు. ఈ బియ్యపు గింజలను గ్రెయిన్‌కాలిపర్ యంత్రంలో పోసి సన్న బియ్యమో కాదో తెలుసుకుంటారు. ఇప్పటికే జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా ఐకేపీ అధ్వర్యంలో 48, సింగిల్‌విండో అధ్వర్యంలో 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లా మొత్తంగా 1.50లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే అధికారులు లక్ష్యంతో ఉన్నారు.

- అయిజ, ఆంధ్రజ్యోతి

6

ఇంటి భోజనం తిని విద్యార్థినులకు అస్వస్థత

- చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలింపు
- నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఘటన



జిల్లా ఆసుపత్రి వద్ద నాగనూలు కేజీబీవీ సిబ్బందితో వాగ్వివాదం చేస్తున్న విద్యార్థినుల కుటుంబ సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి భోజనం తిని నాగనూలు కేజీబీవీలో ముగ్గురు విద్యార్థినులు అస్వస్థతకు గురైన సంఘటన ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో చోటు చేసుకున్నది. కేజీబీవీ ప్రత్యేక అధికారి శోభారాణి తెలిపిన వివరాల ప్రకారం నాగనూలు కేజీబీవీలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అక్షయ, ప్రేమలతతో పాటు మొదటి సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థిని పూజిత వాంతులు చేసుకుని అస్వస్థతకు గురైంది. చికిత్స కోసం జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. విద్యార్థినులు తీసుకున్న ఆహారం గురించి ప్రత్యేక అధికారి ఆరా తీయగా వారిలో ఓ విద్యార్థిని తల్లి ఆదివారం మధ్యాహ్నం తీసుకువచ్చిన ఇంటి భోజనం చికెన్, చపాతి ముగ్గురు విద్యార్థులు కలిసి తిన్నట్లు తెలిసింది. దీంతో కేజీబీవీ ప్రత్యేక అధికారి వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సమాచారం అందించారు. దీంతో అస్వస్థతకు గురైన విద్యార్థినుల తల్లిదండ్రులు జిల్లా ఆసుపత్రికి చేరుకున్నారు. మా పిల్లలు అస్వస్థతకు గురైతే ఆసుపత్రిలో చేర్చేందుకు నిర్లక్ష్యం చేశారని అక్షయ తల్లి వాగ్వాదానికి దిగారు. పాఠశాల భోజనం తిన్న విద్యార్థినులు అందరూ సురక్షితంగా ఉన్నారని, మీరు తెచ్చిన ఇంటి భోజనం వల్లే మీ పిల్లలు అస్వస్థతకు గురయ్యారని కేజీబీవీ ప్రత్యేక అధికారి తెలిపారు. ప్రస్తుతం విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు.



జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నాగనూలు కేజీబీవీ విద్యార్థిని



సాయం సంధ్య వేళ సూర్యుడు పసిడి వర్ణంలోకి మారాడు. నీలాకాశాన్ని అరుణ వర్ణంలోకి మార్చాడు. పొలంలోని నీటిలో ప్రతిబింబమై మెరిశాడు. ఔరా! అనిపించేలా కనిపించిన ఈ దృశ్యం వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వీరాయిపల్లి గ్రామ శివారులో ఆదివారం కనిపించింది. 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటో గ్రాఫర్, వనపర్తి జిల్లా

కోరిన కోర్కెలు తీర్చే

పబ్బతి అంజన్న

- ఈ నెల 11 నుంచి బ్రహ్మోత్సవాలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ కమిటీ

పదర, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలోని మద్ది మడుగు గ్రామంలో కోరిన కోరికలు తీర్చే పబ్బతి అంజనేయస్వామిగా విరాజిల్లుతున్నాడు. ఏడాదిలో రెండు సార్లు కార్తీక, చైత్ర మాసాల్లో ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. ఈ నెల 11 నుంచి 15 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుంకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో రంగాచారి తెలిపారు. ఈ ఉత్సవాలకు తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో హాజరవుతారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మద్దిమడుగులో పబ్బతి ఆంజయేయ స్వామి ఆలయానికి తూర్పు ఈశాన్యంలో కోటమైసమ్మ కొలువుదీరింది. ప్రతీ ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారి దర్శనం కోసం వస్తుంటారు.



మద్దిమడుగు పబ్బతి ఆంజనేయ స్వామి మూల విరాట్

బస్సు రూట్ ఇలా...

ఆర్టీసీ బస్సులు హైదరాబాద్, మాచర్ల, దేవరకొండ డిపోల నుంచి మద్దిమడుగుకు నడిపిస్తుంటారు. అచ్చంపేట నుంచి ఉదయం 5:30 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు గంటకో బస్సు నడుపుతుంటారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నాం

బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశాం. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ముఖ్యమంత్రిని కూడా ఉత్సవాలకు రావాలని ఆహ్వానించాం.

- రాములు నాయక్, ఆలయ కమిటీ చైర్మన్

కనక మహాలక్ష్మి



నాగర్‌కర్నూల్ బస్టాండ్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

(మొదటి పేజీ తరువాయి)

జీరో టికెట్లు మహిళలకు ఇచ్చారు. అదే గతేడాది 6.7 కోట్ల మంది మహిళలు మాత్రమే ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేశారు. ఆర్టీసీకి ఈ ఏడాది రూ.416 కోట్ల ఆదాయం రాగా, గతేడాది రూ.328 కోట్లు మాత్రమే సమకూరింది. అంటే గతేడాదికన్నా రూ.88 కోట్ల ఆదాయం అధికంగా వచ్చింది. ఆర్టీసీ బస్సులను మహిళలు అధిక సంఖ్యలో వినియోగించుకుంటున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో ఉచిత ప్రయాణం

ఉమ్మడి జిల్లాలో 10 ఆర్టీసీ బస్ డిపోలు ఉన్నాయి. మొత్తం 799 బస్సులు ఉన్నాయి. అందులో 485 పల్లె వెలుగు బస్సులు, 280 ఎక్స్‌ప్రెస్, 34 డీలక్స్, 43 హైటెక్ బస్సులు ఉన్నాయి. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్‌లలో మహిళలకు జీరో టికెట్‌లు జారీ చేస్తున్నారు. ఉచిత బస్ ప్రయాణంతో మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కార్గో సర్వీస్‌తో సత్ఫలితాలు

ఆర్టీసీలో ప్రవేశపెట్టిన కార్గో సర్వీస్ ద్వారా కూడా సత్ఫలితాలు వస్తున్నాయి. ఒకరకంగా చెప్పాలంటే నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి కార్గో సర్వీస్ చేదోడు వాదోడుగా నిలిచింది. దశల వారీగా హోం డెలివరీని ప్రవేశపెట్టాలని టీజీఎస్ ఆర్టీసీ భావించిన క్రమంలో మరింత ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. కార్గో సర్వీస్ ద్వారా ఉమ్మడి జిల్లాలోని పది డిపోల్లో ప్రతీ నెల సగటున ఆదాయం రూ.లక్షల్లో ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలో కార్గో సర్వీస్ ద్వారా నెలకు మహబూబ్‌నగర్, గద్వాలలో రూ.15 లక్షల చొప్పున ఆదాయం రాగా, షాద్‌నగర్‌లో రూ. మూడు లక్షలు, వనపర్తిలో రూ.ఐదు లక్షలు, నాగర్‌కర్నూల్‌లో రూ.3.5 లక్షలు, కల్వకుర్తిలో రూ.మూడు లక్షలు. అచ్చంపేటలో రూ.1.5 లక్షలు, నారాయణపేటలో రూ.3.5 లక్షలు, కొల్లాపూర్‌లో 1.5 లక్షల ఆదాయం సమకూరింది. అద్దె దుకాణాల మధ్య పోటీ పెంచడం వల్ల కూడా సంస్థకు ఆదాయం పెరిగింది.

ఇబ్బందులు ఇవీ..

ఫ్రీ బస్ కారణంగా కొన్ని ఇబ్బందులు కూడా లేకపోలేదు. బస్ ముందుగానే ఫుల్ కావడం వల్ల పలు స్టేజీల వద్ద బస్సులు ఆపడం లేదు. బస్సులు ఓవర్‌లోడ్‌తో వెళ్తుండటంతో మహిళలకే సీట్లు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. ఇక టికెట్ తీసుకుని ప్రయాణించే పురుషులకు అసలు సీట్లే ఉండటం లేదు. ఫ్రీ బస్ ప్రయాణం వల్ల ఆటోలకు ఆటోలకు గిరాకీ తగ్గిందని ఆటో వాలాలు అంటున్నారు. గ్రామాలలో ఆటోలు ఎక్కే మహిళల సంఖ్య చాలా వరకు తగ్గిపోయారు. పట్టణాల్లో తక్కువ దూరం ప్రయాణించే చాలామంది మహిళలు కూడా బస్సులనే ఆశ్రయిస్తున్నారు.

ఉచిత ప్రయాణం బాగానే ఉంది



మహిళలకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించడం బాగానే ఉంది. పేద మహిళల ప్రయాణాలకు ఉచిత బస్సు సౌకర్యం ఆసరాగా నిలిచింది. బస్సుల సంఖ్య పెంచితే బాగుంటుంది.

- సి.కళమ్మ, ఎల్లికట్ట

ఉద్యోగులకే బాగుంది



ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత బస్సు సౌకర్యం ఉద్యోగాలు చేస్తున్న మహిళలకే ఎక్కువగా ఉపయోగపడుతుంది. ఉచితంగా ఎక్కే మహిళలం సీటులో కూర్చొంటే పైసలు పెట్టి టికెట్ తీసుకుని పురుషులు నిలబడుతున్నారు. బస్సుల సంఖ్యను ప్రయాణీకనుగుణంగా పెంచాలి.

- ఏ.బాలమణి, గుడిగానిపల్లి

బాగుంది కానీ.. బస్సులు ఆపడం లేదు



ఉచిత బస్సు పథకం బాగుంది. కానీ బస్సులు ఆపడం లేదు. ఈ పథకం వచ్చాక మహిళలు అందరూ కలిసి పుణ్యక్షేత్రాలకు వెళ్తున్నారు. ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం సమయానికి బస్సులు నడిపించి, అన్ని స్టేజీల వద్ద బస్సులు నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలి.

- బాలమణి, హన్వాడ

ఉచిత ప్రయాణంతో మేలు



ఉచిత బస్సు ప్రయాణం మేలుగానేఉంది. దేవాలయాలకు వెళ్లాలంటే గతంలో డబ్బులు లేక ఇబ్బంది పడేవాళ్లం. అలాగే చుట్టాల వద్దకు వెళ్లాలంటే ఎప్పుడో ఓసారి వెళ్లేవాళ్లం. ఇప్పుడు బంధువులను కలవాలంటే ఎప్పుడు అంటే అప్పుడు వెళ్తున్నాం. ఈ ఉచిత ప్రయాణం బాగానే ఉంది. కొంతమంది ఆడపిల్లలు బస్సుల్లో గొడవ పెట్టుకుంటున్నారు. అలా కాకుండా అందరికి సహకరిస్తే బాగుంటది.

- యాదమ్మ, కోస్గి

బస్సుల సంఖ్య పెంచాలి



ఉచిత బస్సు ప్రయాణం మాకు ఎంతగానో ఉపయోగపడుతున్నది. గతంలో ఆటో, ఇతర ప్రైవేటు వాహనాల్లో పోయేవాళ్లం. ఇప్పుడు ఆర్టీసీ బస్సులో సురక్షితంగా ప్రయాణం చేస్తున్నాం. అధిక సమయం ఇంటి వద్దనే ఉండే మాకు ప్రతీ శుభకార్యానికి, ఇతర అవసరాలకు బస్సు ద్వారా ఉచితంగా తిరిగే అవకాశం లభించింది. ఏదైనా అవసరం ఉంటే మగవాళ్లు వెళ్లే స్థితి నుంచి ఇప్పుడు చిన్నచిన్న అవసరాలకు, పనులకు సైతం అధిక శాతం ఆడవాళ్లమే పోయి వస్తున్నాం. ప్రభుత్వం బస్సుల సంఖ్యను కూడా పెంచితే బాగుంటుంది.

- సాయిబోల్ల సావిత్రమ్మ, కిరాణం షాప్ యజమాని, పెద్దపొర్ల

ప్రజల సహకారం కూడా ఉండాలి



ఆర్టీసీ సంస్థ ప్రజలకు అనేక ప్రయోజనాలు చేకూరుస్తుంది. దీనిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిదీ. ఆర్టీసీని లాభాల బాటలో నడిపించాలంటే ప్రతీ ఒక్కరి సహకారం అవసరం. ఆర్టీసీలో సురక్షితమైన ప్రయాణం శ్రేయస్కరమనే విషయాన్ని ప్రతీ ఒక్కరు గుర్తించాలి. రాయితీలు కల్పిస్తున్న సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిది.

- ఆకారపు యాదయ్య, నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్

ఉచిత బస్సు బావుంది..



గోపాల్‌పేట నుంచి వనపర్తికి తరుచూ బస్సులో వెళ్తుంటాను. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు సౌకర్యం చాలా బాగుంది. పేద మహిళలకు బాగా ఉపయోగపడుతుంది. అక్కడక్కడ బస్సుల కొరత, ఆధార్ కార్డు సరిగా లేదని కొందరు కండక్టర్లు అంటున్నారు. ప్రభుత్వం కొత్త బస్సులు ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- అనిత, గోపాల్‌పేట

చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం



సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి చరిత్రలో నిలిచిపోయే నిర్ణయం తీసుకుంది. మహిళలకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. ఉద్యోగినులు, విద్యార్థినులు, రైతులు, కూలీలందరికి లాభసాటిగా మారింది.

- అనురాధ, కాట్రేవుపల్లి, మక్తల్

ఉచిత ప్రయాణంతో డబ్బు ఆదా



వారంలో ఐదురోజులు వివిధ పట్టణాలు, గ్రామాల్లో సంతకు వెళ్లి కూరగాయల వ్యాపారం చేస్తాను. ఉచిత బస్సు ప్రయాణం వల్ల నెలకు రూ.2వేల నుంచి రూ.2,500 వరకు డబ్బులు మిగులుతున్నాయి. ఉచిత బస్సు ప్రయాణంతో నాలాంటి వారికి ఎంతో మేలు జరుగుతుంది. ఇందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఎప్పటికీ కృతజ్ఞతగా ఉంటాము.

- పుష్పావతి, కూరగాయల వ్యాపారి, గద్వాల



బస్సులో గర్భిణికి పురిటి నొప్పులు

ఆసుపత్రికి తరలించిన కండక్టర్

మహబూబ్‌నగర్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం కోస్గి నుంచి మహబూబ్‌నగర్‌కు ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న తొమ్మిది నెలల గర్భిణికి హన్వాడకు రాగానే పురిటి నొప్పులు వచ్చాయి. బస్సు డ్రైవర్ కేశవులు, కండక్టర్ బ్రహ్మయ్య 108కి కాల్ చేసి మహబూబ్‌నగర్ బస్టాండ్‌కు బస్సు చేరిన తర్వాత గర్భిణిని అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడంతో పలువురు అభినందించారు.

కరాటే టోర్నీలో విద్యార్థుల ప్రతిభ



పతకాలు సాధించిన కింగ్‌షోటోకాన్ విద్యార్థులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 8 : కర్నూల్‌లో ఆదివారం జరిగిన సౌత్ ఇండియా కరాటే చాంపియన్‌షిప్‌లో జిల్లా కేంద్రంలో హనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులను చరణ్ బంగారు, వరుణ్‌కుమార్, కిరిటీ వెండి పతకాలు సాధించినట్లు అసోసియేషన్ ఫౌండర్ వెంకటేశ్ తెలిపారు.

కింగ్‌షోటోకాన్‌లో విద్యార్థుల ప్రతిభ..

హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కింగ్‌షోటోకాన్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ పోటీల్లో ఆరు బంగారు, ఆరు రజత, ఎనిమిది కాంస్య పతకాలు సాధించినట్లు కింగ్‌షోటోకాన్ క్లబ్ ఫౌండర్ జహంగీర్‌పాషా ఖాద్రీ తెలిపారు.



పతకాలు సాధించిన హనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని వాహనం ఢీకొని రవి గౌడ్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలంలోని చందుబట్ల గ్రామానికి చెందిన రవిగౌడ్ తన వ్యక్తిగత పనుల మీద నాగర్‌కర్నూల్‌కు వచ్చి తిరిగి వెళ్తున్న క్రమంలో కొల్లాపూర్ చౌరస్తాలోని ఎస్పీ కార్యాలయం సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని కుడి కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం స్థానికులు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భగవద్గీత కంఠస్థ పోటీల్లో విద్యార్థి ప్రతిభ

మక్తల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రామంతపూర్‌లో ఉన్న అరోరా కళాశాలలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత కంఠస్థ పోటీల్లో మక్తల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థి హరికుమార్ ప్రతిభ కనబర్చాడని వీహెచ్‌పీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి భీంరెడ్డి తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ కళాశాలలో హరికుమార్ ఇంటర్ చదువుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థి ప్రతిభ చాటడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు శారద, కతలప్ప, వీహెచ్‌పీ, భజరంగదళ్ నాయకులు సత్యనారాయణగౌడ్, వాకిటి భీమన్న, మల్లికార్జున్‌రావు, భీమేష్, రాహుల్, నరేష్‌కుమార్, మూర్తి, అక్షయ్, నాగరాజు, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీకాతో రోగాలు దూరం

» వ్యాక్సినేషన్‌లో జిల్లా మూడో స్థానం

ఖిల్లాఘణపురం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మూగ జీవాల ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఏడాదిలో రెండు సార్లు టీకాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి, గొర్రెలు, మేకలకు పారుడు రోగం (పుర్రు కొట్టడం) వ్యాధి సోకే అవకాశం ఉంటుంది. పశు సంపదను కాపాడాలని ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించి ఉచితంగా వ్యాక్సినేషన్ చేస్తోంది. పశువైద్య సిబ్బంది ప్రతీ గ్రామానికి వెళ్లి పాడి రైతులకు, గొర్రెల కాపరులకు వ్యాధులపై అవగాహన కల్పించి అప్రమత్తం చేస్తున్నారు. టీకా వేసిన పశువు చెవికి పోగులు వేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. అప్పటికే చెవి పోగు ఉంటే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు 106 డిగ్రీల జ్వరం ఉంటుంది. వ్యాధి సోకిన పశువుల్లో ఐదు శాతం మృత్యువాతకు గురవుతాయి. రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు ప్రభుత్వం సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ఏడాదిలో రెండుసార్లు ఉచితంగా టీకాలను వేస్తోంది.

పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన చేసి పశువుల సంఖ్యను నిర్ధారిస్తారు. 2019 సెన్సెక్స్ ప్రకారం వనపర్తి జిల్లాలో ఆవులు, ఎద్దులు 75,000 కాగా బర్రెలు, దున్నపోతులు 72,000 మొత్తం పశువులు 1,47,000 ఉండేవి. 2024 నాటికి 1,05,550 మాత్రమే మిగిలాయి. ప్రస్తుతం పశుగణన ప్రారంభించగా 2025 మార్చి నాటికి సెన్సెక్స్ పూర్తి చేస్తారు. నవంబరు నెలలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఇందులో 2024 డిసెంబరు 6 నాటికి 1,00,492 పశువులకు టీకాలు వేశారు. పశువైద్య సిబ్బంది జిల్లాలో 96 శాతం వ్యాక్సినేషన్ పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో వనపర్తి జిల్లాను మూడో స్థానంలో నిలిపారు. గోజాతికి వచ్చే ముద్ద చర్మ వ్యాధి నివారణ టీకాలను జూన్, జూలై మాసాలలో వేస్తుంటారు.



శ్రీరంగాపూర్‌లో గొర్రెలకు వ్యాక్సినేషన్ చేస్తున్న పశువైద్యులు

జీవాల్లో పారుడు రోగం (పుర్రు కొట్టడం)

జీవాలు (గొర్రెలు, మేకలు) శీతాకాలంలో పారుడు రోగం తో ఇబ్బంది పడుతుంటాయి. ప్రస్తుతం గ్రామాల్లో ఉన్న గొర్రెల మంద వద్దకు వెళ్లి పశువైద్య సిబ్బంది గొర్రెల కాపరులకు అవగాహన కల్పించి నివారణ టీకాలను వేస్తున్నారు. గత సెన్సెక్స్ ప్రకారం గొర్రెలు 9,70,000, మేకలు 80,000, మొత్తం 10,50,000 జీవాలు ఉండేవి. ప్రస్తుతం 8,57,300 జీవాలు ఉండగా నేటి వరకు 5,22,956 జీవాలకు పశువైద్య సిబ్బంది వ్యాక్సినేషన్‌ను పూర్తి చేసి రాష్ట్రస్థాయిలో వనపర్తి జిల్లాను మూడో స్థానంలో నిలిపారు. మూడు నెలల వయసు దాటిన జీవాలకు సంవత్సరానికి రెండు సార్లు వ్యాక్సినేషన్ చేస్తారు.

జిల్లాలోని పశువైద్యశాలలు

ఏరియా వెటర్నరీ ఆసుపత్రులు - 2, ప్రైమరీ వెటర్నరీ వైద్యశాలలు - 19, వెటర్నరీ సబ్ సెంటర్లు -29, వనపర్తి జిల్లాలో పశువైద్యుల పోస్టులు -19, ప్రస్తుతం రెగ్యులర్ పశు వైద్యులు - 15 , కాంట్రాక్టు వైద్యులు -3, కంపౌండర్లు - 33 మంది ఉన్నారు.

జీవాల వద్దకే వైద్య సిబ్బంది



మూగ జీవాల వద్దకే పశువైద్య సిబ్బంది వచ్చి టీకాలు వేయడంతో జీవాలు ఆరోగ్యంగా ఉంటున్నాయి. సీజనల్ వ్యాధులపై పశు వైద్యులు సూచనలు చేస్తు అవగాహన కల్పిస్తున్నారు. దేశంలో జనాభా పెరిగిన స్థాయిలో పశు సంపద ఏడాదికి ఏడాది తగ్గడం బాధాకరం. పర్యావరణ సమతుల్యత కోసం పశు సంపదను పెంచాల్సిన అవసరం ఉంది.

- శిరీష, పాడి రైతు , కొప్పునూరు

కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రకారం వ్యాక్సినేషన్



కేంద్ర ప్రభుత్వం పశు సంపదకు బడ్జెట్ కేటాయించినప్పుడు ప్రతీ ఏడాది రెండుసార్లు పశువులకు, జీవాలకు వ్యాక్సినేషన్ నిర్వహిస్తాం. ఈ ఏడాది వ్యాక్సినేషన్‌లో వనపర్తి జిల్లా మూడో స్థానంలో ఉంది. పశువులకు టీకాలు వేస్తే పాల దిగుబడి తగ్గిపోతుందనే ప్రచారాన్ని పాడి రైతులు నమ్మవద్దు. పశువుల జీవాల సంరక్షణ ధ్యేయంగా పశు సంవర్ధక శాఖ సిబ్బంది పనిచేస్తోంది.

- డాక్టర్ వెంకటేశ్వర రెడ్డి, డీవీఏహెచ్‌వో, పశుసంవర్ధక శాఖ, వనపర్తి జిల్లా

కొనసాగుతున్న పైపులైన్ పనులు

కొల్లాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామం రత్నగిరి కొండ నుంచి కొల్లాపూర్ పట్టణానికి సరఫరా అయ్యే మిషన్ భగీరథ మంచి నీటి పైపులైన్ లీకేజీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆదివారం నీటి సరఫరా చేయు పైపులైన్ లీకేజీ మరమ్మతు పనులను మునిసిపల్ ఛైర్ పర్సన్ మేకల రమ్య కౌన్సిలర్‌లు పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ... గత రెండు రోజులుగా కొల్లాపూర్‌కు మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా అయ్యే పైపులైన్ సింగోటం రోడ్డులో గల పెట్రోల్ బంక్ దగ్గర అదే విధంగా కొల్లాపూర్‌కు నీళ్ల సరఫరా అయ్యేమార్గంలో ఏడు చోట్ల లీకేజీ కావడం జరిగిందని, దాదాపుగా రెండు రోజుల నుంచి పైపులైన్ లీకేజీ పనులను కొల్లాపూర్ మునిసి పాలిటీ సిబ్బంది శక్తి వంచన లేకుండా మరమ్మతులు చేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఇబ్బంది పడకుండా ఈదమ్మ బావి, పెద్దబావి, ట్యాంకర్ల ద్వారా మునిసిపాలిటీ నుంచి నీటిని సరఫరా చేస్తున్నట్లు మేకల రమ్య వెల్లడించారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు షేక్ రహీంపాషా, ఎండీ నయాం, నాయకులు ఖాదర్ పాషా, బొర్రెల్లి మహేష్, సత్యం, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.



కొనసాగుతున్న మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ పనులు

పదేళ్లలో కాని పనులు ఏడాదిలోనే చేశాం

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే మేఘారెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి

వనపర్తి అర్బన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేయని అభివృద్ధి పనులు ఏడాదిలో చేశామని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ఆదివారం వనపర్తి జిల్లాలో రూ.136 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేశారు. మొదట పెద్దమందడి మండల కేంద్రం నుంచి జాతీయ రహదారి 44కు వెళ్లే మోజర్ల వద్ద 3/0-2 కిలోమీటర్ల వద్ద రూ.6 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హైలెవెల్ వంతెన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వనపర్తి పట్టణానికి తాగునీరు అందించేందుకు రూ.1.76 కోట్ల వ్యయంతో ఓవర్ హెడ్‌ట్యాంక్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. పట్టణంలోని వివిధ వార్డుల్లో రూ.50 కోట్ల అంచనా వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం బుడుగ జంగాల కాలనీలో రూ.70 కోట్ల అంచనా వ్యయంతో అమృత్ 2.0 పథకం కింద వనపర్తి పట్టణానికి నీటి సరఫరా అభివృద్ధి పనులను శంకుస్థాపన చేశారు. అక్కడి నుంచి మర్రికుంట మెడికల్ కళాశాల పక్కన రూ.4 కోట్లతో మహిళా ఉద్యోగుల వసతి గృహ భవనాన్ని ప్రారంభించారు. మెడికల్ కళాశాల పక్కన రూ.5 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న మహిళా సమాఖ్య భవనానికి శంకుస్థాపన చేశారు. రూ.1.10 కోట్ల వ్యయంతో పట్టణంలోని గ్రంథాలయంపై అంతస్తు భవన నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రంథాలయ కార్యాలయంలో మంత్రి జూపల్లి విలేకరులతో మాట్లాడుతూ.. తెలంగాణ అమరవీరులు, ప్రజలు ఏ లక్ష్యం కోసమయితే తెలంగాణ సాధించుకున్నామో ఆ లక్ష్యం గత పది సంవత్సరాల్లో నెరవేరలేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించామన్నారు. ప్రగతి భవన్‌కు ముళ్ల కంచెలు తొలగించి ఎవరైనా సరే ముఖ్యమంత్రితో కలిసే అవకాశాన్ని కల్పించామన్నారు. పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి మాట్లాడుతూ.. డిసెంబరు 21న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో దాదాపు రూ.200 కోట్ల ఎంఎస్‌ఎంఈ రుణాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందించేందుకు మెగా రుణమేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అదే విధంగా కపిలవాయి దిలీప్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తామని తెలిపారు. ఈ సదావకాశాన్ని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ.. వనపర్తి జిల్లాను ఏ శాసన సభ్యుడు అభివృద్ధి చేయని విధంగా అభివృద్ధి చేస్తున్నానని ఈ ఒక్క రోజే దాదాపు రూ.136 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకోవడం జరిగిందన్నారు. పట్టణానికి రాబోయే 25 సంవత్సరాల వరకు తాగునీటి సమస్య రాకుండా అమృత్ 2.0 పథకం కింద పనులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ ఆదర్శ్ సురభి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రమేష్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ కార్యనిర్వాహక ఇంజనీరు దేశ్యా నాయక్, పంచాయతీ రాజ్ ఇంజనీరు మల్లయ్య, మునిసిపల్ కమిషనర్ పూర్ణచందర్, మునిసిపల్ ఛైర్మన్ మహేష్, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మునిసిపల్ వైస్ ఛైర్మన్ కృష్ణ ఉన్నారు.

మతాలకతీతంగా మనిషిని ఆవిష్కరించేదే కవిత్వం

పాలమూరు, డిసెంబరు8 (ఆంధ్రజ్యోతి): మతాలకతీతంగా మనిషిని ఆవిష్కరించేదే కవిత్వమని సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం సభ్యులు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో ఈ నెల 14న నిర్వహించనున్న సమూహ సెక్యులర్ రైటర్స్ ఫోరం రాష్ట్ర మహాసభల సందర్భంగా కవిసమ్మేళనం - ఉర్దూ ముషాయిరా విద్యావేత్త కె.లక్ష్మణ్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. సామాజికవేత్త ముస్తాక్ అభిలాష్, పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎం.రాఘవాచారి, బెక్కెం జనార్దన్, కవులు నూరాపాశి, జనజ్వాల, జగపతిరావు, బోల యాదయ్య, ఖలీల్‌లు ప్రసంగించారు. మతం కంటే ముందు మనుషులమని, మానవత్వమే సమాజ ప్రగతికి దోహదపడుతుందని తెలిపారు. సామాన్యమైన ప్రజల్లో కవులు, విశిష్టత కలిగిన వారని, మతాలను అధిగమించి మానవత్వాన్ని ఆవిష్కరించే దృక్పథం కవులకు ఉండాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సాహిత్యకారులు ఇవాళ దేశానికి అవసరమైన స్నేహ పూర్వకమైన ప్రజాస్వామ్య విలువలను కాపాడాలనే లక్ష్యంతో సమూహ సెక్యులర్‌రైటర్స్ ఫోరం ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. సాహిత్యకారుల ఈ కృషిని మహబూబ్‌నగర్ జిల్లా స్వాగతిస్తుందన్నారు. రచయితలు, సాహిత్యాభిమానులకు అతిథ్యమిస్తుందని తెలిపారు. ధార్మికగ్రంథాలలో సెక్యులరిజమే ఉందని, మత ఉన్మాద చర్యలకు తావులేదని ముస్తాక్ అభిలాష్ తెలిపారు. వల్లభాపురం జనార్దన్, మౌలానా నాసర్, పులి జమున, హనీఫ్, శాంతా రెడ్డి, సత్యవతి, పరిమళ్ కవితాగానం చేశారు.



మాట్లాడుతున్న పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి, లక్ష్మణ్‌గౌడ్

అథ్లెటిక్స్ ఎంపికలు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొనేందుకు పాలమూరు యూనివర్సిటీ అను బంధంగా ఉన్న వివిధ కళాశాలల నుంచి వచ్చిన క్రీడాకారులకు ఆదివారం పీయూలో అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించారు. ఈ ఎంపికల పోటీలను పీయూ ఎంఈడీ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ బషీర్ హమ్మద్ ప్రారంభించారు. పీయూ ఇండోర్ స్టేడియంలో యోగా ఎంపికలను, సింథటిక్ ట్రాక్‌లో అథ్లెటిక్స్ ఎంపికలను నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారులు ఒరిస్సా రాష్ట్రంలోని భువనేశ్వర్ నగరంలో కేఐటీ యూనివర్సిటీలో జరిగే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ అథ్లెటిక్స్ పోటీలలో పాల్గొంటారని పీయూ పీడీ డాక్టర్ శ్రీనివాస్‌లు అన్నారు.

నల్లమల డప్పు కళాకారుడికి కన్నీటి వీడ్కోలు

● అంత్యక్రియల్లో పాల్గొన్న కళాకారులు, ప్రజలు



రామకృష్ణ అంతిమయాత్రలో పాల్గొన్న కళాకారులు, ప్రజలు

అమ్రాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో శనివారం మృతి చెందిన నల్లమల డప్పు కళాకారుడు పెరుమాళ్ల రామకృష్ణ అంత్యక్రియలు నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వంగరోనిపల్లిలో నిర్వహించారు. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధువులతో పాటు పెద్ద ఎత్తున హాజరైన కళాకారులు పాటలు పాడుతూ కన్నీటి వీడ్కోలు పలికారు. రామకృష్ణకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. గత కొన్ని సంవత్సరాల క్రితం పక్షవాతానికి గురైన రామకృష్ణ ఇంటి వద్దనే ఉంటున్నారు. మూడు దశాబ్దాల పాటు తెలంగాణ వ్యాప్తంగా జరిగిన సాంస్కృతిక ఉద్యమంలో రామకృష్ణ చురుకుగా పాల్గొన్నారని తోటి కళాకారులు ఆయనతో ఉన్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రభుత్వ పరంగా సమాజంలో ఉన్న రుగ్మతలు అయిన మూఢనమ్మకాలు, జోగిని వ్యవస్థ నిర్మూలనతో పాటు అసమానతలను రూపుమాపడానికి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో రామకృష్ణ డప్పు కళాకారుడిగా, స్క్రిప్ట్ రైటర్‌గా, డైరెక్టర్‌గా ఎన్నో పాత్రలు నిర్వహించి ప్రజలను మెప్పించారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కూడా రామకృష్ణ పాత్ర మరువలేనిది. ఆయనలాంటి కళాకారులను తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం గుర్తించి సాంస్కృతిక సారథిలో ఉద్యోగం కల్పించినట్లయితే ఈ పరిస్థితులు ఎదురయ్యేవి కావని తోటి కళాకారులు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ విద్యార్థులు



రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధన్వాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు కొండాపూర్ వి ద్యార్థులు ఎంపికయ్యారు. సోమవారం నుంచి కరీంనగర్ జిల్లాలో జరగనున్న 68వ రాష్ట్రస్థాయి క్రీడా సమాఖ్య నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు తరఫున కొండాపూర్ విద్యార్థులు ఆడనున్నారు. ఎస్సీ గురుకులంలో చదు వుతున్న అశోక్ రాథోడ్, అరవింద్ నాయక్, చరణ్, రాకేష్, బాల్‌రాజు, త్రిశాంత్, శివ, బాలకృష్ణ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రాజారాం, వైస్ ప్రిన్సి పాల్ సాంబయ్య శ్రీనివాస్‌నాయక్, పీడీ రాంమోహన్‌గౌడ్, పీఈటీ అంజనేయులు విద్యార్థులను అభినందించారు.

పైసలిస్తేనే ఫైల్ కదిలేది

● ప్రభుత్వ కార్యాలయాల్లో పెరుగుతున్న అవినీతి



● కేసులు తారుమారు చేయడం కోసం డబ్బులు అడుగుతున్న పోలీసులు

● పలు శాఖల్లో కాంట్రాక్టర్‌ల నుంచి కమీషన్ రూపంలో మామూళ్లు

● విసిగి వేసారి ఏసీబీని ఆశ్రయిస్తున్న బాధితులు

● ఈ ఏడాది ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఏసీబీకి చిక్కిన 15 మంది

మహబూబ్‌నగర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ శాఖల్లో ఏ పని కావాలన్నా లంచం.. ముడుపులు ఇవ్వకుంటే ఫైళ్లు కార్యాలయాల్లోనే మగ్గుతుంటాయి.. డబ్బులిచ్చిన వారి ఫైల్ ముందుకు కదిలి వారి పని అయిపోతే.. డబ్బులు ఇచ్చుకోలేని వారి ఫైల్ ఉన్న చోటే ఆగిపోతుంది. రకరకాల కారణాలు.. రూల్స్ చెబుతూ వారిని కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారు. తిరిగి తిరిగి వేసారి చివరకు ఎక్కడోచోట అప్పు చేసి డబ్బులు తెచ్చి పనులు చేయించుకుంటున్నారు.. దాదాపుగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ఇదే తంతు నడుస్తోంది.. డబ్బులు ఇచ్చుకోలేని కొందరు మాత్రం అవినీతి నిరోధక శాఖను ఆశ్రయించి అవినీతి అధికారులను కటకటాలపాలు చేస్తున్నారు... పలువురు అధికారులు ఏసీబీకి చిక్కుతున్నా తమ దాకా వచ్చేవరకు చూసుకుందాంలే అని చాలా కార్యాలయాలలో అధికారులు అవినీతికి పాల్పడుతూనే ఉన్నారు.

ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఈ ఏడాది గడిచిన 11 నెలల కాలంలో 15 మంది అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. అయినా అవినీతికి అడ్డుకట్ట పడటం లేదు. నేడు అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లాలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో వారంరోజులుగా అవినీతి వ్యతిరేక దినోత్సవ వారోత్సవాలను నిర్వహించి ఏసీబీ శాఖ ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.

ఈ ఏడాది జనవరి నుంచి డిసెంబరు 8 నాటికి జిల్లాలో పలు శాఖలకు సంబంధించి 15 మంది అధికారులు వివిధ సేవలకు ప్రజలనుంచి లంచం తీసుకుని ఏసీబీకి చిక్కారు. ఇంకా ఎందరో పలు శాఖలలో అవినీతి అధికారులు యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతూనే ఉన్నారు. చాలామంది ఏసీబీని ఆశ్రయించడానికి ముందుకు రావడం లేదు. వస్తే వారిపై రకరకాల వత్తిడీలు ఉంటాయి. ఎందుకొచ్చిన తంటా అని అడిగిన కాడికి ఇవ్వడం లేదంటే బతిమాలి పదోపరకో తగ్గించి ముడుపు చెల్లిస్తున్నారు.



ఏసీబీకి చిక్కిన జడ్చర్ల ఎక్సైజ్ సీఐ బాలోజి (ఫైల్)

● విద్యాబుద్ధులు నేర్పేవాళ్లే..

జిల్లా విద్యాశాఖ అధికారి అంటే చదువుకునే విద్యార్థులకు రోల్‌మాడల్. అలాంటి అధికారే జిల్లాలో ఉపాధ్యాయులనుంచి లంచాలు తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం గమనార్హం. ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాలో చేర్చాలంటే డబ్బులిస్తే వెనక ఉన్నవారిని ముందువరుసలో చేర్చడం, సీనియారిటీ తక్కువ ఉన్నవారికి ముందుగానే ప్రమోషన్ ఇవ్వడం, అక్రమ డిప్యూటేషన్, బదిలీలలో ఉపాధ్యాయుల నుంచి విచ్చలవిడిగా లంచాలు తీసుకుంటున్న మహబూబ్‌నగర్ డీఈవో రవీందర్ రూ.50 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడటంతో విద్యాశాఖ ఉలిక్కిపడింది.

● ఒక శాఖ అంటూ లేదు

ప్రజలకు ఉచితంగా సేవలందించాల్సిన పలువురు అధికారులు డబ్బులు ఇస్తేనే పనులు చేస్తాం అన్న స్థాయికి వ్యవస్థను తీసుకెళ్లారు. చివరకు ప్రజలు కూడా వాళ్లు అడగకముందే ఫార్మాలిటీస్ చేస్తాం.. తమ పనిని త్వరగా చేసి పెట్టండని బతిమాలుకునే వరకు చేరింది. డబ్బులిస్తే పనులు త్వరగా అవుతాయి లేదంటే పనికాదు అనేలా తయారైంది. ఈ ఏడాది అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వారిలో ఇద్దరు సబ్‌ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు తహసీల్దార్‌లు, ఇద్దరు ల్యాండ్ సర్వేయర్లు, డీఈవో, మునిసిపల్ కమిషనర్, మునిసిపల్ ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్, ఓ ట్రాన్స్‌కో అధికారి, ఎక్సైజ్ సీఐ ఉన్నారు. ప్రజలు సేవలు చేయించుకునే దాదాపు అన్ని కీలక శాఖల అధికారులు జాబితాలో ఉన్నారు.

● కేసులు తారుమారు చేయడం, కేసుల్లో తీవ్రత తగ్గించడం, కేసులో పేరులేకుండా చేయడం వంటి పనులను పోలీస్ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. జైలుకు పంపించాలన్నా, పంపించకుండా ఆపాలన్నా, కఠిన సెక్షన్‌లు తొలగించాలన్నా పెద్ద మొత్తంలో డబ్బులు మాట్లాడుకుంటున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది ఉమ్మడి జిల్లాలోని మహ్మదాబాద్, వెల్దండ ఎస్సైలు ఏసీబీకి చిక్కారు. జడ్చర్లకు చెందిన ఎక్సైజ్ సీఐ బాలోజి కల్లు దుకాణాల లైసెన్స్ విషయంలో డబ్బులు డిమాండ్ చేసి చిక్కాడు. డబ్బులిస్తే గీతగీయని వారికి లైసెన్స్‌లు జారీ చేసే అధికారులు, ఇవ్వకుండా మాత్రం వారికి చుక్కలు చూపిస్తున్నారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో మునిసిపల్ , పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలలో కాంట్రాక్టర్‌ల నుంచి కమిషనర్ రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎంబీ బుక్కు కదలాలంటే ముందుగా డబ్బులు ముట్టజెప్పాలి. అవికూడా ఒక్కో సెక్షన్‌లో రూ.50 - లక్ష ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే ఈ ఏడాది పెబ్బేర్ మునిసిపల్ కమిషనర్, మహబూబ్‌నగర్ మునిసిపల్ ఏఈ, ఇటిక్యాల ఏఈలు అవినీతి నిరోధక శాఖకు చిక్కారు. ఒక వ్యాపారులు దుకాణాల లైసెన్స్ విషయంలోనే కమర్షియల్ సేల్ ట్యాక్స్ అధికారులకు డబ్బులు ముట్టజెప్పాల్సిందే.. ఈ ఏడాది ఓ దుకాణం జీఎస్‌టీ లైసెన్స్ విషయంలో డబ్బులు తీసుకుంటుడగా డిప్యూటీ స్టేట్ టాక్స్ అధికారి అధికారులకు పట్టుబడ్డారు. ఇక తహసీల్దార్ కార్యాలయాల్లో ధరణి తప్పుల సవరణ, భూముల రిజిస్ట్రేషన్ విషయంలో స్లాట్‌లు ఇవ్వడంలోనూ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఏడాది ఇద్దరు తహసీల్దార్‌లు ఏసీబీకి చిక్కారు.

● ఏసీబీని ఆశ్రయించండి

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు చేయించుకోవడానికి ఎవరూ లంచం ఇవ్వవద్దు. అధికారులు లంచం ఇవ్వాలని అడిగితే ఏసీబీ అధికారులను ఆశ్రయించాలి. వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం. చాలామంది ఎవరికీ చెప్పుకోలేక లంచాలిస్తున్నారు. అవినీతికి పాల్పడటంతో పాటు డబ్బులు ఇచ్చి అవినీతిని ప్రోత్సహించడం కూడా నేరమేనన్న విషయాన్ని ప్రజలు గమనించాలి.- బాలకృష్ణ, ఏసీబీ డీఎస్పీ

క్రైం కార్నర్

పొయ్యిల కట్టెలకు నిప్పంటించిన దుండగులు

● నిత్యాన్నదాన కేంద్రం వద్ద రూ.50 వేల నష్టం



నిత్య అన్నదానం కేంద్రం వద్ద పొయ్యిల కట్టెలకు నిప్పంటించిన దృశ్యం

కొల్లాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మండల పరిధిలోని సింగోటం గ్రామంలో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం సమీపంలో ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి వారి నిత్య అన్నదానం కేంద్రం వద్ద భారీగా నిల్వ ఉన్న పొయ్యిల కట్టెలకు శనివారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. నంద్యాల జిల్లా పేరసోముల గ్రామానికి చెందిన లక్ష్మీ నరసింహ స్వామి భక్తుడు రామ్మోహన్ స్వామి మల్లెపల్లి చిన్న నరసింహారెడ్డి జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నిత్య అన్నదానం కేంద్రం వద్ద త్వరలో రాబోతున్న సింగోటం లక్ష్మీ నరసింహ స్వామి జాతరకు హాజరయ్యే భక్తులకు వంటలు వండి పెట్టేందుకు సరిపడా పొయ్యిల కట్టెలను ఇటీవలే అక్కడ నిల్వ చేశారు.

రూ. 50 వేల విలువ గల పొయ్యిల కట్టెలకు నిప్పంటించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివారం నిత్య అన్నదాన కేంద్రం నిర్వాహకులు రామ్మోహన్ స్వామి భక్తులు వెంకట్రాంరెడ్డి, సురేందర్ సింగ్, అగ్రస్వామి, తాటికొండ కృష్ణ, చందన, శీనులు ఎస్‌ఐ హృషికేష్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నీటి గుంతలో పడి ప్రమాదవశాత్తు బాలిక మృతి

గండీడ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నీటి గుంతలో పడి ప్రమాదవశాత్తు బాలిక మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని రుసుంపల్లి గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రుసుంపల్లి గ్రామానికి చెందిన కోస్గి వెంకటయ్య, పద్మమ్మలకు ఇద్దరు సంతానం. కుమారుడు హర్షవర్ధన్, కుతూరు అన్షిక (5) అంగన్‌వాడీకి వెళ్లేది. తల్లిదండ్రులు ఆదివారం నాడు పిల్లలను ఇంటి దగ్గర పెట్టి పొలం పనులకు వెళ్లారు. పిల్లలు ఆడుకుంటూ పొలం దగ్గరకు నీరు తాగడానికి వెళ్లారు. ప్రమాదవశాత్తు బాలిక అన్షిక(5) నీటి కుంటలో పడి మృతి చెందిందని తెలిపారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహమ్మదాబాద్/గండీడ్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదంగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన మహమ్మదాబాద్ మండల పరిధిలోని మొకర్లబాద్ ముందలితండా వైకుంఠధామంలో చోటు చేసుకుంది. ఎస్సై శేఖర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తి (35) పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్యకు పాల్పడటంతో తీవ్ర గాయాలై కొట్టుమిట్టాడుతుండగా, గ్రామస్థులు చూసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే సంఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు 108 వాహనానికి సమాచారంతో చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందినట్లు తెలిపారు. బ్లూకోర్టు పోలీసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కోడి పందెం స్థావరంపై దాడి

నాగర్‌కర్నూల్ క్రైం, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కోడి పందెం స్థావరంపై దాడి చేసి తొమ్మిది మంది అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలోని చందాయిపల్లి రెవెన్యూ గ్రామ శివారులో కోడి పందెం నిర్వహిస్తుండగా వల పన్ని తొమ్మిది మందిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. వారితో పాటు ఎనిమిది సెల్‌ఫోన్లు, ఏడు బైకులు, ఆరు పందెంకోళ్లు, 25వేల 500రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. పట్టుబడ్డ నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఫాంపాండ్ గుంతలో పడి ఏడేళ్ల చిన్నారి మృతి

హన్వాడ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పొలం వద్ద ఆడుకుంటూ వెళ్లిన ఓ చిన్నారి ఫాంపాండ్‌లో పడి చనిపోయిన ఘటన ఆదివారం మండలంలోని నల్లోనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కేశవులు, మాధవి దంపతులకు కూతురు, కొడుకు కాగా ఆదివారం పాఠశాలకు సెలవు కావడంతో పిల్లలను తీసుకుని తమ వ్యవసాయ పొలం వద్దకు వెళ్లారు. వీరి ఇద్దరి పిల్లలతో పాటు తమ కుటుంబీకులకు చెందిన మరో ఇద్దరు పిల్లలు అక్కడే ఉన్నారు. అందరూ కలిసి ఆడుకుంటుండగా తల్లి మాధవి వ్యవసాయ పనుల్లో నిమగ్నమైంది. నలుగురు పిల్లలు పొలం పక్కనే ఐసీఐసీఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తవ్విన ఫాంపాండ్ బావి వద్దకు వెళ్లారు.

అందులో ఏడేళ్ల చిన్నారి అందులో పడిపోయింది. నీళ్లు ఎక్కువగా ఉండటం, తల్లి గమనించి బావిలో దూకి బయటకు తీసే సమయానికే చిన్నారి మరణించడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామంలో విషాదచాయలు అలుముకున్నారు.

సాగులో యంత్ర పరికరాలకే ప్రాధాన్యం

● వడ్ల నుంచి బియ్యం తీసే ప్యాడీహస్కల్

● సన్నాలను గుర్తించే గ్రెయిన్ కాలిపర్

● గన్నీ బ్యాగులపై కోడ్ విధానం

● రైతుల ఐరీస్ విధానం



వడ్ల గింజలను బియ్యపు గింజలుగా మార్చే ప్యాడీహస్కల్ పరికరం



సన్నధాన్యాన్ని గుర్తించే గ్రెయిన్ కాలిపర్

అయిజ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సన్నాల కొనుగోళ్లలో సాంకేతికతకు ప్రాధాన్యం ఇచ్చారు. మనుషుల కంటే కూడా వారు తయారు చేసిన యంత్ర పరికరాలే ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. వరి కొనుగోలు కేంద్రాలలో ప్రారంభం నుంచి చివరి వరకు కూడా సాంకేతకతను వాడుకుని కొనుగోళ్లు చేస్తున్నారు. వరి కొనుగోలు కేంద్రానికి తెచ్చింది మొదలు మిల్లులకు తరలించే వరకు యంత్రాలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఏ గ్రేడ్ వరి ధాన్యానికి రూ.2,320, బీ గ్రేడ్ ధాన్యానికి రూ.2,300 మద్దతు ధరగా చెల్లించి రైతుల నుంచి వరి కొనుగోలు చేస్తోంది. దీనికి తోడుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం ధాన్యానికి బోనస్‌గా రూ. 500 అందచేస్తోంది. ఇప్పటికే జోగుళాంబ గద్వాల జిల్లా వ్యాప్తంగా కొనుగోళ్లు ప్రారంభం అయ్యాయి. ఈ సాంకేతికత, యంత్ర పరికరాలు ఉపయోగం, వినియోగంపై కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు అవగాహన ఇచ్చారు. జిల్లా మొత్తంగా వరి కొనుగోళ్ల కోసం ఐకేపీ ఆధ్వర్యంలో 48, సింగిల్‌విండో ఆధ్వర్యంలో 16 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. జూరాల, కృష్ణ, తుంగభద్రా నది పరివాహక ప్రాంతాలు, బావులు, బోర్లు, వాగులు, వంకలు, కుంటల పరిధిలో వరి సాగు చేశారు. జిల్లా మొత్తంగా లక్షా 50 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో అధికారులు ముందుకు వెళుతున్నారు. శనివారం వరకు జిల్లా మొత్తంగా 31,441 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. రూ.500 బోనస్‌తో కలుపుకుని మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశారు.

డిజిటల్ మాయిశ్చర్ మీటర్

వరిలోని తేమ శాతాన్ని తెలుసుకోటానికి దీనిని ఉపయోగిస్తారు. రైతులు కోతల అనంతరం వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకు వస్తారు. మొదటగా వాడేది ఈ యంత్ర పరికరాన్నే. ప్రభుత్వం వరి ధాన్యంలో తేమ శాతం 15 ఉంటేనే కొనుగోలు చేయాలన్న నిబంధన విధించింది. అంతకంటే ఎక్కువ ఉంటే ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తుంది. ధాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం తగ్గాకే కొనుగోలు చేస్తుంది.

సన్న రకం ధాన్యాన్ని గుర్తించే గ్రెయిన్ కాలిపర్

ధాన్యం సన్న రకమా, దొడ్డ రకమా అని గుర్తించేందుకై గ్రెయిని కా లిపర్ (డయల్ మైక్రో మీటర్)లను వాడుతున్నారు. ఈ యంత్ర పరికరంతో గుర్తింపు చేస్తున్నారు. ఈ యంత్రం సహాయంతో సన్న బియ్యం గింజ పొడవు, వెడల్పును కొలుస్తారు. సన్న రకంగా గుర్తించటానికి బియ్యంపు గింజ పొడవు ఆరు మిల్లీ మీటర్ల కంటే తక్కువగాను, వెడల్పు రెండు మిల్లీ మీటర్ల కంటే తక్కువగాను ఉండాలనే నిబంధన నిర్దేశించారు.

బియ్యపు గింజలు తీసే ప్యాడి హస్కల్

వడ్ల గింజలు నుంచి వరి బియ్యపు గింజలు తీసేందుకై ప్యాడిహస్కల్‌ను కొనుగోలు కేంద్రాలకు అందచేశారు. ఒక్కొక్క కేంద్రానికి రెండు చొప్పున అందచేయటం జరిగింది. గుప్పెడు వరి ధాన్యాన్ని తీసుకుని ఈ పరికరంలో పోసి తిప్పితే వరి ధాన్యంపై ఉన్న పొట్టు ఊడిపోయి బియ్యంపు గింజలు వస్తాయి. ఈ బియ్యపు గింజలను గ్రెయిన్‌కాలిపర్ యంత్రంలో పోసి సన్న బియ్యమో కాదో తెలుసుకుంటారు.

గన్ని బ్యాగులపై కోడ్ ఏర్పాటు

వరి ధాన్యాన్ని నింపటానికి ఉపయోగించే గన్నీ బ్యాగులపై కోడ్ విధానాన్ని వాడుతున్నారు. ఈ బ్యాగులపై కొనుగోలు కేంద్రం యొక్క కోడ్, ధాన్యం రకం వివరాలు చేస్తారు. సన్న రకం ధాన్యం అయితే ఎరుపు రంగుతో కొనుగోలు కేంద్రం కోడ్ నెంబర్ ధాన్యం రకం వద్ద వేస్తారు.

ఐరీస్ విధానం

ఐరీస్ విధానాన్ని వరి కొనుగోలు కేంద్రాలలో అమలు చేస్తున్నారు. గతంలో ఓటీపీ విధానాన్ని అనుసరించే వారు. కేంద్రం నుంచి లారీల్లో ధాన్యాన్ని పంపేటపుడు ఓటీపీ తీసుకుని ట్రక్ షీట్‌ను మిల్లులకు పంపేవారు. ఇపుడు సంబంధిత రైతు ఐరీస్ తీసుకుంటున్నారు.

ప్రస్తుతం ఇందులోను ఉన్నతాధికారులు సడలింపు ఇచ్చినట్లు సమాచారం. ఆధార్ ఆధారంగా ఓటీపీతో పనులు పూర్తి చేస్తున్నారు.

రెండు రోజుల్లో రైతు ఖాతాలోకి..

రైతులకు మద్దతు ధరతో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సన్నాలకు అందిస్తున్న బోనస్ రూ.500లు అందుతోంది. కొనుగోలు జరిగిన రెండు రోజుల్లో అసలుతో పాటు బోనస్ డబ్బులు జమ అవుతున్నాయి. శనివారం వరకు జిల్లా మొత్తంగా 31,441 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశాం. రూ.500 బోనస్‌తో కలుపుకుని మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేశాం.

- ఆవుల స్వామికుమార్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి

మద్దూర్‌లో టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు ప్రారంభం

- ఉమ్మడి జిల్లాలోనే తొలుత పైలెట్ ప్రాజెక్టుగా మద్దూర్‌లో సేవలు అందుబాటులోకి



మండల పరిషత్‌లో టీఫైబర్ ఇంటర్నెట్ సేవల ప్రారంభం సందర్భంగా పాల్గొన్న అధికారులు, నాయకులు

మద్దూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎపుడెప్పుడా అని ఎదరు చూస్తున్న టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు ఎట్టకేలకు మద్దూర్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. తక్కువ ధరకే ఇంటర్నెట్ అందించేందుకు చేపట్టిన ఈ ప్రాజెక్టును మొదటగా పైలెట్ ప్రాజెక్టు కింద నారాయణపేట జిల్లా మద్దూర్, పెద్దపల్లి జిల్లా అడవి శ్రీరాంపూర్, సంగారెడ్డి జిల్లా సంఘంపేట్ గ్రామాల్లో అందుబాటులోకి వచ్చాయి. మంత్రి శ్రీధర్‌బాబు హైదరాబాద్‌లో టీఫైబర్ ఇంటర్నెట్ సేవలను ప్రారంభించారు. ఇట్టి సేవలకుగాను ఉమ్మడి జిల్లా మద్దూర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా తొలుత సేవలు ప్రారంభమవడం సంతోషకరమని గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకే ఇంటర్నెట్ సేవలు సౌలభ్యం లభించినట్లైంది. రానున్న రోజుల్లో అన్ని గ్రామాలకు సేవలు ప్రారంభించేందుకు ప్రభుత్వం చర్యలు ప్రారంభించిందని అధికారులు వెల్లడించారు. టీఫైబర్ ఇంటర్నెట్ సేవలు కేవలం రూ.300 కే ఇంటర్నెట్, కేబుల్ టీవీతో పాటు రక్షణ సేవలు, విద్యార్థులకు ఈ-ఎడ్యుకేషన్ తదితర సేవలు అందుబాటులో రానున్నాయి. మద్దూర్‌లో టీ ఫైబర్ ఇంటర్నెట్ సేవల ప్రారంభం సందర్భంగా ఎంపీడీవో నర్సింహారెడ్డి, పీసీఎస్ అధ్యక్షుడు నర్సింహ ఇతర అధికారులు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

నీటి సరఫరా బంద్

మహబూబ్ నగర్ కలెక్టరేట్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మరికల్ నుంచి నారాయణపేటకు పోయే దారిలో కొత్త తండా దగ్గర మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ అవుతుండటం వల్ల అట్టి పైపులను తీసి కొత్త పైపులు అమర్చడానికి మంగళవారం సాయంత్రం ఆరు గంటల వరకు నీటి సరఫరాను నిలిపి వేయడం జరుగుతుందని మిషన్ భగీరథ గ్రిడ్ మహబూబ్ నగర్ డివిజన్ కార్యనిర్వాహక అధికారి పుట్ట వెంకట్ రెడ్డి ఆది వారం ఒక ప్రకటనలో తెలిపారు. మన్యంకొండ నీటి శుద్ధి కేంద్రం నుంచి నీటి సరఫరా అయ్యే దేవరకద్ర, నారాయణ పేట, మక్తల్ అసెంబ్లీ నియోజక వర్గాల లోని దేవర కద్ర, నర్వ, మరికల్, ఊట్కూర్, నారాయణపేట, దామరగిద్ద మండ లాల్లోని అన్ని గ్రామాలు పూర్తిగా, కౌకుంట్ల, చిన్నచింతకుంట, మక్తల్, ధన్వాడ మండలాల్లోని గ్రామాల్లో పాక్షికంగా, మక్తల్, నారాయణపేట మునిసిపాలిటీలు పూర్తిగా మొత్తం 245 గ్రామాలు, రెండు మునిసిపాలిటీలు నీటిసరఫరాను నిలిపి వేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకు సంబంధించిన గ్రామాలు, మునిసి పాలిటీ ప్రజలు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

21క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మక్తల్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్‌రోడ్ వద్ద ఆదివారం ఉదయం 21క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు ఎస్సై భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు. రాయచూరు జిల్లా మల్కాపురంకు చెందిన ఎరుకలి వీరేష్ మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రజల నుంచి రేషన్ బియ్యం సేకరించి బొలెరో వాహనంలో రాయచూరుకు తరలిస్తుండగా మక్తల్ పట్టణంలోని నారాయణపేట క్రాస్‌రోడ్ వద్ద పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుబడ్డ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గురురాజారావుతో పంచనామా నిర్వహించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన

● గోవిందనామ స్మరణతో మారుమోగిన భూత్పూర్

● పోచమ్మకు బోనాలు సమర్పించిన మహిళలు

● ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకల్లో పూజలు చేసిన ఎమ్మెల్యే జీఎంఆర్, మాజీ ఎమ్మెల్యే ఆల



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ కేంద్రంలో గత మూడు రోజులుగా గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు అంగరంగ వైభవంగా జరిగాయి. గ్రామంలోని పోచమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన, కర్రెమ్మ, కోటమైసమ్మ, బొడ్రాయి, ఆంజనేయస్వామి, మునిరంగస్వామి దేవాలయాల వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు వేదపండితుల సమక్షంలో మూడు రోజుల పాటుగా హోమాలు, యజ్ఞాలు కనుల పండువగా జరిగాయి. ఆదివారం చివరి రోజు బొడ్రాయి, పోచమ్మ దేవత బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. అంతకు ముందు తెల్లవారుజామున ఆంజనేయస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు భక్తుల గోవిందనామాల నడుమ ఆనందోత్సవాలతో జరిగాయి. అదే విధంగా పోచమ్మ, కర్రెమ్మ, కోట మైసమ్మ, బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠాపనలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. గ్రామంలో ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం కనిపించింది.

అదే విధంగా వీధులన్నీ మామిడాకులు, వేపాకుల తోరణాలతో కళకళలాడాయి. మునిరంగస్వామి దేవాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాల్లో దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, స్థానిక మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్‌తో కలిసి పోచమ్మ, కర్రెమ్మ, బొడ్రాయి విగ్రహాల వద్ద పూజలు చేశారు. మునిరంగస్వామి దేవాలయం వద్ద భక్తులతో కలిసి మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. సాయంత్రం మహిళలు పోచమ్మ దేవతకు బోనాల పండుగ వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. 80 ఏళ్ల తరువాత గ్రామ దేవతలను ఒకేసారి ప్రతిష్ఠించుకోవడం చాలా సంతోషంగా ఉందని బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు, సామాజికవేత్త టీ మురళిధర్‌గౌడ్ ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో ఆడపడుచులు నూతన వస్త్రాలు ధరించి ఇంటి కడపలకు పసుపురాసి పూజలు చేశారు. అంతకు ముందు ఇంటి నుంచి కలశంతో నీరు తీసుకెళ్లి ధ్వజస్తంభానికి పూజలు చేశారు. మునిసిపల్ చైర్మన్ బస్వరాజుగౌడ్, మాజీ ఎంపీపీలు చంద్రశేఖర్‌గౌడ్, కదిరే శేఖర్‌రెడ్డి, బీజేపీ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సుదర్శన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు లిక్కీ నవీన్‌గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు మురళిధర్‌గౌడ్, గోప్లాపూర్ సత్యనారాయణ, సత్తయ్యగౌడ్, ముక్తా శ్రీశైలం, నారాయణగౌడ్, అశోక్‌గౌడ్, బోరింగ్ నర్సిములు, వార్డు కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి, యువకులు సురేష్‌కుమార్‌గౌడ్, గడ్డం ప్రేమ్‌కుమార్, తిరుపతయ్యగౌడ్, కృష్ణయ్యగౌడ్, భక్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ

- ఎంఈవో భాస్కర్ శర్మ



కోడేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాము. ఉన్నతాధికారుల ఆదేశానుసారం ప్రతీ రోజు పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న, విద్య, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి మెనూ ప్రకారం భోజనం అందించాలని దిశానిర్దేశం చేస్తున్నాం. పాఠశాలను సందర్శించి వంట గది పాత్రలు, పరిసరాలు తదితర అంశాలను పరిశీలించి శుభ్రత పాటించాలని వంట ఏజెన్సీలను ఆదేశిస్తున్నామని 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

వంట ఏజెన్సీ వారికి బిల్లులు చెల్లిస్తున్నారా, పెండింగ్ ఏమైనా ఉన్నాయా?

పెండింగ్‌లో ఏమీ లేవు. వంట ఏజెన్సీ వారికి అక్టోబరు బిల్లులు చెల్లించాం. నవంబరు బిల్లులు చెల్లిస్తున్నాం.

పాఠశాలలో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయా, ఇక్కడ పోస్టింగ్ ఉండి, వేరేచోట ఉద్యోగం చేస్తున్నారని తెలిసింది నిజమా?

మొన్న బదిలీలు, కొత్త రిక్రూట్‌మెంట్ ఉపాధ్యాయులు అందరూ వచ్చారు. కానీ కోడేరు సీపీ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు కల్వకుర్తికి డిప్యూటేషన్‌పై వెళ్లారు. కోడేరు గుట్ట పీఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయుడు డిప్యూటేషన్‌పై నాగర్‌కర్నూల్ వెళ్లారు.

విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, దుస్తులు సరఫరా చేశారా?

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందరికీ పంపిణీ చేశాం.

సామాజిక పోరును ఉధృతం చేయాలి : డీహెచ్‌పీఎస్

తాడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాట స్ఫూర్తితో సామాజిక పోరును ఉధృతం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ జిల్లా సలహాదారు మోహన్, మండల ఉపాధ్యక్షులు పల్లె రాజు, ఆంజనేయులు, కృష్ణయ్య, హనుమంతు, వెంకటయ్య, శ్రీను, కృష్ణమ్మ, మైసమ్మ, బక్కమ్మ, నర్సమ్మ, అలివేల, వెన్నెల పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌టీయూసీ జెండావిష్కరణ

అచ్చంపేటటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ నాయకులు సోనియాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా సోమవారం పట్టణంలో ఐఎన్‌టీయూసీ జెండావిష్కరణ ఉన్నందున ప్రతీ ఒక్కరు పాల్గొనాలని ఐఎన్‌టీయూసీ తాలూకా అధ్యక్షుడు మహబూబ్‌అలీ అన్నారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన ముఖ్యనాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పట్టణంలోని పోస్టాఫీస్ దగ్గర కాంగ్రెస్ నాయకులు సోని యాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా ఐఎన్‌టీయూసీ జెండా అవిష్కరణతో పాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ వస్తారని తెలిపారు.కార్యక్రమంలో నాయకులు చందు నాయక్, రాజు, జయరాం, మహేష్, రాములు పాల్గొన్నారు.

మండలంలో మోస్తరు వర్షం

అమ్రాబాద్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఆదివారం మధ్యాహ్నం మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో ఇటీవల తరచుగా వర్షాలు కురుస్తుండడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది, మిరప తదితర పంటలు దెబ్బతిన్నాయి. రైతులు వరి పంట నూర్పిళ్లు చేస్తుండడంతో ధాన్యం తడిసిపోతుందని మండలంలోని వివిధ గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉపాధి పనులపై గ్రామసభ

పెద్దకొత్తపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని యాపట్లలో ఉపాధి హామీ పనులపై ఆదివారం గ్రామసభ నిర్వహించారు. 16 పనులకుగాను రూ. 19,25,930లు ఖర్చు చేసినట్లు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ నాగరాజు తెలిపారు. గ్రామసభలో పలు అంశాలపై గ్రామస్థులు ప్రస్తావించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పరశురాం, ఉపాధి హామీ అధికారులు, ఏపీవో మంజుల, డి.ఆర్‌పి రాములమ్మ, టీఏ శ్రీనయ్య, మాజీ సర్పంచు సీతారాం నాయక్, నాయకులు కృష్ణగౌడ్, జహంగీర్, శ్రీశైలం, విష్ణు, బక్కయ్యగౌడ్, గ్రామస్థులు పాల్గొన్నారు.

తాగునీరు రావడం లేదని గ్రామస్థుల నిరసన

పెంట్లవెల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గోప్లాపూర్ గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీరు సరిగా రావడం లేదని గ్రామస్థులు రోడ్డుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కాలనీవాసులు ఆంజనేయులు మాట్లాడుతూ నాలుగో వార్డులో 15 రోజులుగా రాకపోవడంతో నిత్యం ఇబ్బందులకు గురవుతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీరు సరిగా రావడం లేదని పంచాయతీ కార్యదర్శికి ఎన్నోసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో శివమ్మ, మంగమ్మ, శ్రీనివాసచారి పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం

- జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి

- ఆరు అబద్ధాలు, 66 మోసాలపై నిరసన



అచ్చంపేట బైక్ ర్యాలీలో పాల్గొన్న జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు అచారి

కల్వకుర్తి/ కల్వకుర్తిటౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ 6 అబద్ధాలు, 66 మోసాలతో అధికారంలోకి వచ్చిందని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి విమర్శించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే హామీలన్నీ పూర్తి చేస్తామని ప్రకటించి ఏడాదైనా అమలుకు నోచుకోలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ఏడాది పాలన వైఫల్యాలపై జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి ఆధ్వర్యంలో కల్వకుర్తి, అచ్చంపేట పట్టణాల్లో భారీ బైక్ ర్యాలీ, సభ నిర్వహించారు. కల్వకుర్తిలో మాట్లాడుతూ డిండి ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందలేదని, గోకారం చెరువు రిజర్వాయర్‌గా మారుస్తామని చెప్పి చెరువును కూల్చివేశారని కేఎల్‌ఐ ద్వారా సాగునీరందిస్తామని హామీ నెరవే రాలేదని విమర్శించారు. కల్వకుర్తిలో వంద పడకల ఆసుపత్రి పనులు ఎప్పుడు ప్రారంభిస్తారని ప్రశ్నించారు.

• అచ్చంపేటలో ర్యాలీ అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి సభలో మాట్లాడారు. అచ్చంపేటలో 50వేల ఓట్ల మెజార్టీతో గెలిచిన ఎమ్మెల్యే వంశీకృష్ణ హామీలు అమలు చేయకుండా అచ్చంపేట ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీజేపీ అధికారంలో రావడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కట్ట సుధాకర్ రెడ్డి అన్నారు. ఇప్పటికైనా సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి మొద్దు నిద్ర వీడి ఇచ్చిన హామీలను అమలుపర్చాలని, లేకపోతే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు. కల్వకుర్తిలో బీజేపీ నాయకులు ఎన్నం శేఖర్‌రెడ్డి, మొగిలి దుర్గాప్రసాద్, బండెల రామచంద్రా రెడ్డి, కండె హరిప్రసాద్, రాఘవేందర్‌గౌడ్, నరసింహ, అచ్చంపేటలో కార్యక్రమంలో బీజేపీ నాయకులు నరేందర్‌రావు, మంగ్యానాయక్, బాలాజీ, జానకి, కొండల్‌రెడ్డి, శ్రీను నాయక్, చందులాల్ పాల్గొన్నారు.

అచ్చంపేట పట్టణాభివృద్ధికి కృషి

- అయ్యప్ప మాల ధరించిన ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



వంగూరులో రైతులకు స్ప్రింక్లర్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్/ వంగూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉమామహేశ్వర క్షేత్రంలో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఉమా మహేశ్వరుడిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ముందుగా పాపనాశిని గుండంలో పుణ్యస్నానం ఆచరించాక, గురుస్వాములు, అర్చకులు వీరయ్య శాస్త్రీ ఆధ్వర్యంలో అయ్యప్ప మాలధారణ చేశారు. అనంతరం ఈశ్వరునికి వివిధ అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చన, అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు రామ్మూర్తి, రాజశేఖర్, ఆనంద్‌శర్మ, చంద్రశేఖర్‌లు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయం ఆవరణలో శాలువాతో ఆల య ఈవో శ్రీనివాసరావు ఆలయ కమిటీ ఛైర్మన్ బీరం మాధవరెడ్డిలు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అచ్చంపేట పట్టణంలోని 14 వార్డులో రూ. 16 లక్షలతో నిర్మించనున్న డ్రైనేజీ స్లాబ్ నిర్మాణ పనులకు ఆయన మునిసిపల్ ఛైర్మన్ శ్రీనివాసులుతో కలిసి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 3 వార్డులో నిర్మిస్తున్న పల్లెదవాఖాన పనులను పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. అచ్చంపేట పట్టణం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సోమవారం కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో పలు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నాయకులు గోపాల్‌రెడ్డి, అంతటి మల్లేష్, రఘు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలో రాష్ట్రం అభివృద్ధి

ఏడాది ప్రజాపాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందిందని అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. ఆదివారం వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లిలో రైతులకు సబ్సిడీ స్ప్రింక్లర్ సెట్లను ఎమ్మెల్యే, రాష్ట్ర వ్యవసాయ సంక్షేమ కమిషన్ సభ్యుడు కేవీఎన్‌రెడ్డిలు కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ పాండురంగారెడ్డి, డీసీసీ కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి, వేమారెడ్డి, కృష్ణారెడ్డి, జంగయ్యయాదవ్ పాల్గొన్నారు.

బిజినేపల్లిలో తాగునీటికి కట కట

- భగీరథ, పంచాయతీ సిబ్బంది మధ్య సయోధ్య లేక ప్రజలు ఇక్కట్లు

- అధికారులు పట్టించుకోకపోతే రోడ్డెక్కుతామంటున్న గ్రామస్థులు



బిజినేపల్లిలోని మిషన్ భగీరథ తాగునీటి సరఫరా ట్యాంక్‌లు

బిజినేపల్లి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన బిజినేపల్లిలో పదేళ్ల తర్వాత మళ్లీ తాగునీటికి కటకట మొదలైంది. మిషన్ భగీరథ గ్రిడ్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, పంచాయతీ అధికారుల మధ్య సయోధ్య లేకపోవడంతోనే గ్రామంలో నీటి ఎద్దడి ఏర్పడిందని పలువురు చర్చించుకుంటున్నారు. ప్రత్యేక అధికారుల పాలనలో పర్యవేక్షణ లేకపోవడంతో సంబంధిత శాఖ అధికారులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడంతోనే తాగునీటి కోసం పొలాల్లోని బోరుబావుల వద్దకు ప్రజలు పరుగుపెడుతున్నారు. ట్యాక్సీల వసూలపై ఉన్న శ్రద్ధ ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎందుకు లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే బిందెలతో రోడెక్కుతామని హెచ్చరిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

గ్రామంలో నీటి సరఫరా సక్రమంగా చేపట్టకుండా ఆలసత్వంగా వ్యవహరిస్తున్న సంబంధిత శాఖ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉన్నట్లు నా దృష్టి తీసుకరాలేదు. పరిశీలించి గ్రామంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటా.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

బల్మూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల కొండనాగుల గ్రామంలోని శ్రీ ఉమా మహేశ్వరి ప్రభుత్వ డిగ్రీకళాశాలలో 2014-17 సంవత్సరంలో డిగ్రీ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం కళాశాలలో సమావేశమయ్యారు. అందరూ ఒకే చోట చేరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గతంలో ప్రిన్సిపాల్‌గా పని చేసిన శ్రీనివాసులు హాజరయ్యారు. కళాశాల అధ్యాపకులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఫిరంగి రవి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు జరుపుకోవడం వల్ల విద్యార్థుల్లో స్నేహభావం పెరుగుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ధూప్‌సింగ్ లకవత్, టీవీ లక్ష్మాగౌడ్, శివకుమార్, ముంతాజ్‌బేగం, గాయత్రి, నర్సింహులు, పూర్వ విద్యార్థులు రవీందర్, రేణుబాబు, రూపేష్, వెంకటేశ్‌గౌడ్, కురుమూర్తికుమార్ పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

వెల్దండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అకాల మృతి చెందిన స్నేహితుడి కుటుంబానికి ఆ చిన్న నాటి మిత్రులు అండగా నిలిచారు. ఆ కుటుంబానికి తమ వంతుగా ఆర్థిక సాయం చేసి తమ ఉదారత చాటుకున్నారు. ఎర్రబెల్లి గ్రామానికి చెందిన సలేశ్వరం గత కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. వెల్దండలో 1998 సంవత్సరం పదవ తరగతి బ్యాచ్ వారు రూ. 85వేలు సేకరించి కూతురు పేరిట డిపాజిట్ చేశారు. డిపాజిట్ పత్రాన్ని ఆదివారం మృతుని భార్య రేణుకకు స్థానిక పోలీసుల సమక్షంలో అందజేశారు. ఏఎస్‌ఐ జానకి, స్నేహితులు అంజన్‌కుమార్, సురేష్, తిరుపతి, రవీందర్‌రెడ్డి, అన్వర్‌బేగం, సుశీల్, కొండల్, తారకరామారావు, జక్కుల శ్రీను, పురుషోత్తంరెడ్డి, కృష్ణ, యాదగిరి, మల్లికార్జున్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి



కల్వకుర్తిలో మహాసభల వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న సీపీఎం నాయకులు

కల్వకుర్తి/ తెలకపల్లి/ అచ్చంపేట టౌన్/ ఉప్పునుంతల/ బల్మూరు, డిసెంబరు 8 (ఆంధ్ర జ్యోతి) : ఈ నెల 14, 15వ తేదీల్లో అచ్చంపేటలో జరగనున్న సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.ఆంజనేయులు కోరారు. కల్వకుర్తిలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. తెలకపల్లిలోనూ సీపీఎం జిల్లా మూడో మహా సభల వాల్‌పోస్టర్లను ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆర్.శ్రీనివాసులు ఆవిష్కరించారు. మహాసభలకు సీపీఎం జాతీయ నాయకుడు బీవీ.రాఘవులు, ప్రజా వాగ్గేయకారుడు, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న ముఖ్యఅతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు ఏపీ మల్లయ్య, పులిజాల పరశురాములు, రైతు సంఘం జిల్లాఅధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, తెలకపల్లి కార్యక్ర మంలో సీపీఎం మండల కార్యదర్శి గోపాస్ లక్ష్మణ్, నాయకులు విజయ్‌గౌడ్, బాబు, విజయ్‌గౌడ్, శివ, అబ్బాస్, మల్లేష్ పాల్గొన్నారు.

అచ్చంపేటలో వివిధ కార్మిక సంఘాల సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వర్ధం పర్వతాలు పాల్గొని మాట్లాడారు.

ఉప్పునుంతల మండలం రాయిచేడు గ్రామంలో సీపీఎం మహాసభల వాల్ పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పర్వతాలు విడుదల చేశారు. ఈ నెల 14, 15 తేదీలలో నియోజకవర్గ కేంద్రంలో జరిగే సీపీఎం మహా సభలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు చంద్రయ్య, లింగమయ్య, వెంకటయ్య, శివ కుమార్, ఎండీ సయ్యద్, మల్లేష్, పాల్గొన్నారు.

బల్మూరులో సీపీఎం జిల్లా మూడవ మహాసభల వాల్ పోస్టర్లను ఆదివారం సీపీఎం మండల కార్యదర్శి ఎం.శంకర్‌నాయక్ విడుదల చేశారు. మండల నాయకులు ఎండీ లాల్ మహ్మద్, ఆంజనేయులు, బారీమామ్, యాదగిరి, లక్ష్మయ్య, మల్లేష్ పాల్గొన్నారు.

'హామీల అమలులో కేంద్రం విఫలం'

కల్వకుర్తి డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి రాపోతు అనిల్‌గౌడ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కల్వకుర్తిలో బీజేపీ నాయకులు, కాంగ్రెస్ సంవత్సర పాలన వైఫల్యాలపై ర్యాలీ నిర్వహించడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సమావేశంలో యువజన కాంగ్రెస్ నాయకులు దళపతి గౌడ్, అభినవ్‌రెడ్డి, బీస బాలరాజు, ఇమ్రాన్ బాబా, పురుషోత్తం పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

కల్వకుర్తి, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి పనులను నాణ్యతగా సకాలంలో పూర్తి చేయాలని కల్వకుర్తి మునిసిపల్ ఛైర్మన్ ఎడ్మ సత్యం కోరారు. కల్వకుర్తి పట్టణంలోని 21వ వార్డులో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను కౌన్సిలర్ సైదులుతో కలిసి ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

దివ్యాంగుల పాలిట వరదాయినీ సర్వోదయ విద్యా సంస్థ

కందనూలు డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సర్వోదయ విద్యా సంస్థ దివ్యాంగులకు అందించిన సేవలు ఎనలేనివని దివ్యాంగుల సంఘ రాష్ట్ర నాయకుడు నాగభూషణం అన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని శారీరక, బధిర దివ్యాంగులకు విద్య, వైద్య సేవలు అందించి వారి భవిష్యత్తుకు బంగారుబాట వేయడానికి జాతీయ సర్వోదయ నాయకులు భూదానం సుబ్బారావు కుటుంబం అందించిన విశేష సేవలు అపూర్వమైనవని సర్వోదయ దివ్యాంగుల పాఠశాల విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగభూషణం అన్నారు. కార్యక్రమంలో సర్వోదయ విద్యా సంస్థ వ్యవస్థాపకులు భూదానం సుబ్బారావు, చైల్డ్ రైట్స్ ఫోరం బాధ్యులు నబి, రామచందర్, బాలపీరు, వేణు, కోఆర్డినేటర్ లలితమ్మతో పాటు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రుణమాఫీ చేయాలి

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకు వెంటనే మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో తెలంగాణ రైతు సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చిలుక బాల్‌రెడ్డి, నాయకులు వి.వెంకటేష్, బాలరాజు, సత్యం, శివరాములు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తా

- ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



రాచాలపల్లి వద్ద బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

ఊర్కొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని, ప్రజల సహకారం అవసరమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని ముచ్చరపల్లి, ఇప్పపహాడ్ గ్రామాల్లో సీసీ రోడ్లు, గుండ్లగుంటపల్లిలో అంగన్‌వాడీ భవనం నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా జకినాలపల్లిలో తుర్క చెరువు రూ.5 కోట్ల 74 లక్షలతో నిర్మాణం, రాచాలపల్లి వద్ద రూ.2 కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జకినాల పల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి పథకాలను వివరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకటయ్యగౌడ్, మండల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ద్యాప నిఖిల్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సమి, యువజన కాగ్రెస్ మండల అధ్యక్షుల ఆది నారాయణ, నాయకులు పర్వత్‌రెడ్డి, శ్యామ్ సుందర్ రెడ్డి, పోలె శంకర్, మనోహర్‌రెడ్డి, ధర్మేందర్ రెడ్డి ఆరిఫ్, జంగారెడ్డి ఉన్నారు.

• 108 అంబులెన్స్ ప్రారంభం : రాష్ట్ర ప్రభుత్వం మండల కేంద్రానికి కేటాయించిన అంబులెన్స్‌ను ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రారంభించి కొద్దిసేపు నడిపారు.

తుల్జా భవానీ మాత ఆలయం ప్రారంభోత్సవం



అమ్మ వారికి మొక్కులు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

ఉప్పునుంతల, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని లత్తీపూర్ గ్రామంలో ఆదివారం గిరిజనుల ఆరాధ్య దైవం తుల్జాభవాని మాత ఆలయాన్ని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గువ్వల బాలరాజు ప్రారంభించారు. తుల్జా భవాని మాతకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు రవి మాజీ సర్పంచ్ మల్లేష్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలన దేశానికి ఆదర్శం

- కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి లింగం యాదవ్



మాట్లాడుతున్న లింగం యాదవ్

నాగర్‌కర్నూల్ టౌన్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కేసీఆర్ పదేళ్ల నిరంకుశ పాలనకు చరమగీతం పాడి అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రజాపాలన దేశానికే ఆదర్శమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ లింగం యాదవ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. నీళ్ల పేరుతో నిధులను దోచుకున్న కేసీఆర్ పదేళ్లలో చేయలేని పనులను సీఎం రేవంత్‌రెడ్డి ఏడాదిలో చేసి చూపించారన్నారు. ఏడాదిలోనే నిరుద్యోగ యువతకు 55 వేల ఉద్యోగాల భర్తీతో పాటు 21 వేల కోట్ల రైతు రుణమాఫీ, మహిళలకు ఉచిత బస్సు, రెండు వందల యూనిట్ల ఉచిత విద్యుత్, సబ్సిడీతో వంట గ్యాస్ వంటి సంచలనాత్మక పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు ఆచారి, జగన్, కౌన్సిలర్లు జక్కా రాజు, తీగల సునేంద్ర, పద్మ, మాధవి, బచ్చన్నయాదవ్, నాయకులు సంపత్, బాదం నరేందర్, అచ్యుతారెడ్డి పాల్గొన్నారు.

హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

కొల్లాపూర్, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో హమాలీలకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని హమాలీ యూనియన్ జిల్లా కార్యదర్శి డి.ఈశ్వర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్రం ప్రవేశ పెట్టిన, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరారు. ఆదివారం కొల్లాపూర్‌లోని రాఘవేంద్ర రైస్ మిల్ ఆవరణలో హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 44 కార్మిక చట్టాలను మార్చి సంపన్న వర్గాలకు అనుకూలంగా కోడ్‌లుగా చేసి కార్మికుల శ్రమను దోచి కార్పొరేట్లకు కట్టబెట్టిందని దుయ్యబట్టారు. హమాలీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఈదన్న, సత్యనారాయణ, కార్మికులు సంగెం, ఎల్లయ్య, పక్కీర పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చారకొండ, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గోకారం గ్రామానికి చెందిన దామెర్ల విజేందర్ ఇటీవల గొంతుకు సంబంధించిన వ్యాధికి చికిత్స పొంది ఇంటి వద్దనే ఉన్నాడు. విషయం తెలుసుకొన్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి పగడాల అంజేయులు ఆదివారం విజేందర్‌ను పరామర్శించి ఆర్థిక సహాయం రూ. 13,500 అందజేశారు. కార్యక్రమంలో జనార్దన్, మహేష్, వెంకటయ్య, నరసింహ, హరి, లక్ష్మయ్య, రమేష్, భాస్కర్, అనిల్, రామకృష్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలి

తిమ్మాజిపేట, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం వెంటనే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద్ నరేష్ మాదిగ డిమాండ్ చేశారు. తిమ్మాజిపేటలో గ్రామాల వారీగా తరలి వచ్చిన మాదిగల సమావేశంలో ఆదివారం ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణను కమిటీ, కమిషన్ పేరిట కాలయాపన చేస్తున్నారని, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవించాలన్నారు. మాదిగలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. కాలయాపన జరిగితే ఉద్యమిస్తామన్నారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ప్రవీణ్, ఉపాధ్యక్షులుగా బంగారయ్య, ప్రధాన కార్యదర్శిగా విష్ణుమాదిగను కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు గూట విజయ్, దశరథం, కాసీం, దానం జగన్‌రాజ్, దేవస్వామి, వెంకటయ్య, స్వామి, వెంకటేశ్, కాశ్ల రాజు, లక్ష్మయ్య, రమాకాంత్ పాల్గొన్నారు.

హామీలను వెంటనే అమలు చేయాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ

కోడేరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.నరసింహ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలముందు అధికారం కోసం హామీలు ఇచ్చి అధికారం వచ్చాక అమలు చేయడంలో విఫలం అవుతోందని విమర్శించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ పూర్తిగా చేయలేదని పేర్కొన్నారు. వ్యవసాయ పెట్టుబడికి రైతు భరోసా ఇవ్వలేదని, నిరుపేదలకు రేషన్‌కార్డులు, అర్హులైన వారందరికి పెన్షన్లు ఇంకా ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు రవి, నరసింహ, లక్ష్మయ్య, పి.రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

రహదారులపై వరి-వాహనదారుల వర్రీ

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



లచ్చిరాంతండా సమీపంలో ప్రధాన రహదారిపై ఆరబోసిన వడ్లు

తాడూరు, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : తాడూరు మండలంలోని నాగర్ కర్నూల్-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఇంద్రకల్, లచ్చిరాం తండా, ఐతోల్, సిర్సవాడ, పాపగల్ గ్రామాల పరిధిలో ఉన్న రహదారిపై మొత్తం ధాన్యపు రాసులే ఉన్నాయి. దీంతో రహదారిపై ధాన్యం ఉండడం మూలంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒక వాహనం వచ్చినట్లయితే మరో వాహనం వెళ్లేందుకు అవకాశం లేకుండా ధాన్యపు రాసులు ఉండడంతో తరచూ ఎక్కడో ఒక దగ్గర ప్రమాదాలు జరుగుతున్నాయి. కొనుగోలు కేంద్రాల నుంచి కొనుగోలు చేసిన ధన్యాన్ని మిల్లులకు తరలించే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని అన్నదాతలు, వాహనదారులు కోరుతున్నారు. దీనికి తోడుగా అల్పపీడన ప్రభావంతో చెదురు ముదురు జల్లులు పడుతుండడం మూలంగా ధాన్యం తడిసే ప్రమాదం ఉంటుందంటూ రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సివిల్ సప్లయ్ అధికారులు స్పందించి కొను గోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తి చేస్తే బాగుంటుందని గ్రామాల్లోని రైతులు కోరుతున్నారు.